క్లుప్తంగా

మే 1న బైక్ ర్యాలీ

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రపంచ కార్మిక దినోత్సవం మే 1ని పురస్కరించుకొని ఖమ్మం బైపాస్ రోడ్ పెద్ద కూరగాయల మార్కెట్ నుంచి సీఐటీయూ ఆధ్వర్యాన 200 బైక్‌లతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు వై.విక్రమ్ పేర్కొన్నారు. సోమవారం జరిగిన మార్కెట్ హమాలీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరాటాలతో సమస్యలు పరిష్కారమవుతాయని మేడే స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్, సీతయ్య, సైదులు, బీరప్ప, సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

9లోగా టెండర్ ఫారాలు సమర్పించాలి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో స్టేషనరీ, ప్రింటింగ్, ఎలక్ట్రికల్ వస్తువుల సప్లై చేయడానికి అర్హత కలిగిన ఏజెన్సీలు వచ్చే నెల 9లోగా టెండర్ ఫారాలు సమర్పించాలని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యాలయాల పనివేళల్లో మే 2వ తేదీలోగా రూ. 5వేలను మెడికల్ సూపరింటెండెంట్, ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పేరుమీద డీడీ, బ్యాంక్ చెక్ తీసి టెండర్ ఫారాలను సమర్పించాలన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు

కామేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ ఆధ్వర్యాన ప్రతిష్ట చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ ఏడీ ఆనంద్‌కుమార్ అన్నారు. ముచ్చర్ల బీసీ కాలనీలో ఇళ్లపై నుంచి 11 కేవీ విద్యుత్ లేన్ వెళ్లడంతో తమ సమస్యను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నేలకొండపల్లి: మండల కేంద్రంలో మీనాక్షి కంటి ఆస్పత్రి ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అతి తక్కువ ధరకు కళ్లద్దాలు అందించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు కె.శ్రీధర్‌గౌడ్, డాక్టర్ ధనరాజ్, జక్కంపూడి లిఖిత, గ్రామ పెద్దలు గెల్లా జగన్‌మోహన్‌రావు, కాసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సన్నగిల్లిన సమీకృతం..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో మూతబడిన నాన్‌వెజ్ మార్కెట్



కొత్త బస్టాండ్ పక్కన మార్కెట్‌లో మూతబడిన దుకాణాలు



వీడీవోస్ కాలనీ మార్కెట్ మొదటి అంతస్తులో..



నిరుపయోగంగా ఉన్న పగోడాలు

సమీకృత మార్కెట్లపై నిర్లక్ష్యం
- నిర్వహణ లోపాలు.. మూతబడిన మార్కెట్లు
- దళారుల పెత్తనంతో తగ్గిన ఆదరణ
- నిరుపయోగంగా రూ. కోట్ల నిర్మాణాలు
- నీరుగారిన మార్కెట్ల లక్ష్యం

ఖమ్మంవ్యవసాయం: గృహ అవసరాలు, ఆహార పదార్థాలు అన్ని ఒకేచోట లభ్యమయ్యేలా రూపొందించిన సమీకృత మార్కెట్ల లక్ష్యం నీరుగారింది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం ఆదరణ సన్నగిల్లింది. కాగా, ఖమ్మం నగరంగా, కార్పొరేషన్‌గా అభివృద్ధి చెందిన నేపథ్యాన సమీకృత మార్కెట్లు ఆవశ్యంగా భావించి నగరంలోని రెండు రైతుబజార్‌లను తొలగించి సమీకృత మార్కెట్లను ఏర్పాటు చేసింది.

సకల సౌకర్యాలతో..

ప్రజలు నిత్యం వినియోగించుకునే శాఖాహార, మాంసాహారాలతో పాటు నిత్యావసరాలు లభించేలా ఈ మార్కెట్లను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా బైపాస్‌రోడ్‌లోని నూతన బస్టాండ్ పక్కన తొలుత సమీకృత రైతు బజార్‌ను, ఆ తర్వాత వీడీవోస్ కాలనీలో ఏసీపీ కార్యాలయం పక్కన అధునాతన విధానంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. కూరగాయలు, ఆకుకూరలు విక్రయించుకునేందుకు ప్రత్యేకంగా ఓపెన్ షెడ్లు, పండ్లు, పూలు విక్రయించుకునేందుకు పగోడాలు, గొర్రె, మేక, కోడి మాసంతో పాటు చేపల విక్రయానికి ప్రత్యేక నిర్మాణాలు, నిత్యావసరాల కోసం దుకాణ సముదాయాలు, వాహనాల పార్కింగ్, పిల్లలు ఆడుకునేందుకు పార్కు వంటి సౌకర్యాలు కల్పించారు. అయితే ఈ మార్కెట్లలో స్థానం కోసం రైతులు, వ్యాపారులు రాజకీయ నాయకులకు పెద్ద ఎత్తున పైరవీలు, లంచాలు ముట్టచెప్పి వ్యాపార దుకాణాల్లో చోటు సంపాదించారు.

నిరుపయోగంగా నిర్మాణాలు..

కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన సమీకృత మార్కెట్లు నిరుపయోగంగా మారాయి. నగరంలోని నూతన బస్టాండ్ పక్కన 27 దుకాణాలతో కూడిన సముదాయం, పగోడాలు, మాంసాహార సముదాయం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఈనేపథ్యాన దీన్ని వాహనాల పార్కింగ్ కిరాయికి ఒకరికి, రియల్ ఎస్టేట్ వ్యారికి ఓ దుకాణం, తాగునీరు వ్యాపారం చేసే ఒకరికి మరో దుకాణాన్ని కిరాయికి ఇచ్చారు. ఇక వీడీవోస్ కాలనీ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మొదటి అంతస్తు పూర్తిగా ఖాళీ కాగా గ్రౌండ్‌ఫ్లోర్‌లో మాత్రమే అంతంత మాత్రంగా విక్రయాలు సాగుతున్నాయి. నాన్‌వెజ్ మార్కెట్ పూర్తిగా మూసివేశారు. దీంతో కొందరు ఇక్కడ సేంద్రియ విక్రయాల పేరిట ప్రతీ నెల రెండో శనివారం, ఆదివారాల్లో మూలం సంత పేరిట పలు రకాల నిత్యావసరాలను విక్రయిస్తున్నారు. ఈ మార్కెట్ కూడా కొందరు ఈ ప్రాంతవాసులకు పార్కింగ్ స్థలంగా ఉపయోగపడుతుంది. ఇక ఈ మార్కెట్ల నిర్వహణకు ఎస్టేట్ ఆఫీసర్లు, సెక్యూరిటీ సిబ్బంది, పర్యవేక్షణకు ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. అయినా ఈ మార్కెట్ల లక్ష్యం ముందడుగు వేయడం లేదు.

పైరవీల శాపం..

నిర్వహణలో చోటు చేసుకున్న లోపాల కారణంగా సమీకృత మార్కెట్ల లక్ష్యం నీరు గారింది. సాధారణంగా ఆహార ఉత్పత్తులు, మాంసాహారం, నిత్యావసరాలను ఉత్పత్తి చేసే వారికి, తయారు చేసే వారికి అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించాల్సి ఉంటుంది. వీటితో పాటు ఆహార పదార్థాలు, నిత్యావసరాల ధరలు పరిస్థితులకు అనుగుణంగా సామాన్యులకు, వినియోగాదారులకు అందుబాటులో ఉండేలా సమగ్ర చర్యలుండాలి. అటువంటి విధానాలు, చర్యలు అవలంబించకపోవడంతో మార్కెట్ల లక్ష్యం పక్కదారి పట్టింది. మూడేళ్ల క్రితమే ప్రజా ప్రతినిధులు, పైరవీకారులు అండతో మార్కెట్‌లో స్థానం సంపాదించిన కొందరు దళారుల పెత్తనంతో మార్కెట్లలో ధర కన్నా బయట రిటైల్ మార్కెట్లలో ధరలు తక్కువగా ఉంటున్నాయని వినియోగదారులు చెప్పారు. అప్పటి నుంచి మాంసాహారాలు, పండ్లు, పూలు వంటి విక్రయాలు లేకుండా పోయాయి. అరకొరగా కూరగాయలు, ఆకుకూరలు వంటివి విక్రయించినా వీటికీ ఆదరణ లేకుండాపోతోంది.

లక్ష్య సాధనకు కృషి



మున్సిపల్, మార్కెటింగ్ శాఖల పర్యవేక్షణలో సమీకృత మార్కెట్లు నిర్వహించబడుతున్నాయి. నాన్‌వెజ్ మార్కెట్ల పర్యవేక్షణ మున్సిపల్‌శాఖ పర్యవేక్షిస్తుంది. కొందరు రోడ్ల వెంట కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలు వంటివి విక్రయిస్తుండడంతో వీటిని ఆదరణ తగ్గింది. ఇలా రోడ్ల వెంట అమ్మకుండా నియంత్రిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు. ఆదాయం కోసం వాహనాల పార్కింగ్, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాలకు కిరాయిలకు ఇచ్చాం.

– ఎంఏ అలీం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

జవాబుదారీతనం పెంచేందుకే 'భూ భారతి'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మేయర్ నీరజ, తదితరులు

ఖమ్మంఅర్బన్/నేలకొండపల్లి: రైతులకు జవాబుదారీతనాన్ని పెంచేందుకే భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి పేర్కొన్నారు. సోమవారం భూభారతి చట్టంపై ఖమ్మం డీపీఆర్సీ భవనంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మేయర్, అదనపు కలెక్టర్ మాట్లాడగా.. నేలకొండపల్లి మండలంలో జరిగిన గ్రామసభలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, సాదాబైనామా సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం ఓ చక్కటి అవకాశమన్నారు. ధరణి రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగనున్నాయని, భూ హక్కులకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే వచ్చే ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, నేలకొండపల్లి మండలంలో గ్రామసభలు నిర్వహించగా.. అప్పలనరసింహాపురంలో వివిధ సమస్యలపై 92, రాజారాంపేటలో 55, కోరట్లగూడెంలో 98 దరఖాస్తులను అందించారు. గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, ఆర్డీఓ నర్సింహారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.వెంకటేశ్వరరావు, వీవీపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు, కార్పొరేటర్లు కమర్తపు మురళి, హుస్సేన్, తహసీల్దార్ రవికుమార్, ఆర్‌ఐలు వహీద్, సాయి నరేష్, ఎస్‌కె.మీరా, యర్రబోయిన గోవిందరావు, రమేష్, బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొనగా, నేలకొండపల్లిలో తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, తఫ్జల్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్రాన్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆలస్యం మధుసూదన్‌రావు, అల్లం రవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రఘునాథపాలెంలో..

రఘునాథపాలెం: రఘునాథపాలెం రైతు వేదికలో నేడు(మంగళవారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విల్సన్ బెన్నీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించండి



ప్లీనరీకి తరలివెళ్లిన ఉద్యమకారులు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం చలో సికింద్రాబాద్ ప్లీనరీకి ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలంగాణ ఉద్యమకారులు తరలి వెళ్లిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా 250 గజాల స్థలం, రూ.25 వేల పెన్షన్, ఇల్లు నిర్మాణానికి రూ.10 లక్షలు వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలంగాణ ఉద్యమకారులు రవిచంద్ర చౌహాన్, నేలవెల్లి వెంకటేశ్వరావు, పెళ్ళూరి విజయ్‌కుమార్,రెడ్డెబోయిన వరలక్ష్మి ఫోరం ఖమ్మం జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచమల్ల ఉమ, కామని అనంతలక్ష్మి, గద్దె వెంకట్రామయ్య, వెంకటప్పయ్య, గోపయ్య, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పోషణ పక్షోత్సవాలు

పోషణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాస కార్యక్రమాలను ఐసీడీఎస్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రదర్శనలు నిర్వహించి పోషకాహార ప్రాముఖ్యతను అధికారులు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



కూసుమంచి: నాయకన్‌గూడెంలో సీమంతాలు..

కేఎంసీ సమాచారం..

● ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. సోమవారం కేఎంసీ గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి అధికారులకు అందజేసి మాట్లాడారు. రెవెన్యూ సమస్యలను సత్వర పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని, శానిటేషన్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించి సంబంధిత ఫొటోలను పెట్టాలన్నారు.

● 14 లేఔట్లకు ఆమోదం..

జిల్లా లేఔట్ల కమిటీ సమావేశంలో 22 లేఅవుట్లకు సంబంధించిన దరఖాస్తులు రాగా.. వాటిని పరిశీలించిన అధికారులు కమిషనర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 14 లేఔట్లకు ఆమోదం తెలిపారు.

● నర్సరీల పరిశీలన..

నగరంలోని కేఎంసీ నర్సరీలను ఉద్యాన అధికారిణి బి.రాధిక సోమవారం పరిశీలించారు. నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలను పరిశీలించి గార్డెన్ వర్కర్లకు పలు సూచనలు చేశారు.

● మేనేజర్‌కు సీటు లేదంట..!

కేఎంసీకు నూతన మేనేజర్‌గా బుచ్చిబాబు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం విధులకు వచ్చిన మేనేజర్‌కు ప్రత్యేక రూమ్, సీటు లేకపోవడంతో కంట్రోల్ రూమ్, ఏఎంసీ చాంబర్ వద్ద కొద్ది సమయం కూర్చున్నారు. గత మేనేజర్ బదిలీపై వెళ్లగా.. రెవెన్యూ అధికారి ఆ గదిలో కూర్చోగా మేనేజర్‌కు సీటు, గది లేకుండా పోయింది.



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ అగస్త్య

● 'ఎర్లీబర్డ్'పై దృష్టి సారించడం లేదు..

ఆస్తి పన్నుల వసూళ్లకు ప్రభుత్వం ఎర్లీబర్డ్ కింద 5 శాతం రాయితీని ప్రకటించన విషయాన్ని యజమానులకు చెప్పే అధికారి లేకుండాపోయాడని కేఎంసీలో చర్చ జరుగుతోంది. గతేడాది ఈ స్కీం కింద రూ.8 కోట్లకు పైగా పన్నులు వసూలు చేయగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.4.32 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఈ నెలాఖరు వరకే గడువు ఉన్నందున వినియోగించుకునేలా చూడాలని కోరుతున్నారు.

● సర్వర్ స్లో..

ఎల్‌ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ కోసం ఫీజులు చెల్లించి వారాలు గడుస్తున్నా ప్రొసిడింగ్స్ రావడం లేదని కేఎంసీ అధికారులను కలుస్తున్నారు. సర్వర్ స్లోగా ఉండడం చూసిన యజమానులు ప్రొసీడింగ్స్ కోసం ఇంకా ఎన్ని రోజులు ఆగాలని ప్రశ్నిస్తున్నారు.

ఎక్కడి ధాన్యం అక్కడే..



నేలకొండపల్లి మార్కెట్‌లో ఆరబెట్టిన ధాన్యం రాశులు



కూసుమంచి-నేలకొండపల్లి రహదారిపై పట్టాలు కప్పిన దృశ్యం

- కాంటాల్లో తీవ్ర జాప్యం
- ఏ రహదారి వెంట చూసిన ధాన్యం రాశులే
- కలవరపెడుతున్న మబ్బులు

నేలకొండపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. కాంటాలు, ఎగుమతులతో తీవ్ర జాప్యం అవుతుండడంతో ఎక్కడి బస్తాలు అక్కడే ఉన్నాయి. క్వింటాళ్ల కొద్ది ధాన్యం రాశులు రహదారుల వెంట ఆరబెట్టి ఉన్నాయి. మారుతున్న వాతావరణంలో మార్పులతో రైతులు కంటి మీద కునుకు లేకుండా జాగారం చేస్తున్నారు.

పర్యవేక్షణ కరువు..

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఈనేపథ్యాన నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన రైతు యలమంద దాదాపు తన 600 బస్తాలను గత 20 రోజుల క్రితం కాంటాలు వేయించినా నేటికీ మిల్లులకు తరలించ లేదు. ఇలా దాదాపు 2 వేల బస్తాల వరకు ఎగుమతి చేయలేదు. మండలంలోని చెరువుమాధారం, ముజ్జుగూడెం, సింగారెడ్డిపాలెం, రాజేశ్వరపురం తదితర గ్రామాల్లో కాంటాలు వేసి వేలకొద్ది బస్తాలు రోజులు తరబడి ఎదురుచూస్తున్నారు. చెరువుమాధారం సొసైటీ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇటీవల జాప్యం తట్టుకోలేక రైతులు బస్తాలు ఎత్తుకెళ్లారు.

కమ్ముకుంటున్న మబ్బులు..

కమ్ముకుంటున్న మబ్బులతో రైతులు ఉలిక్కిపడుతున్నారు. ధాన్యం రాశులపై ఉదయం పరదాలు తీయడం, సాయంత్రం కప్పడం పరిపాటిగా మారింది. ఇటీవల రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం నీటిపాలైంది. ఇకనైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

● విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 11కేవీ గోపాలపురం విద్యుత్ ఫీడర్‌లైన్ మరమ్మతుల దృష్ట్యా నేడు (మంగళవారం) ఆ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ యాదగిరి, మమత విద్యుత్ సెక్షన్ ఏఈ లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాస పరిసరాలు, కోకాకోలా గోదాం వెనక భాగం, ఎస్‌ఆర్‌స్కూల్ పరిధిలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

● జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి ఎంపిక



చర్విితను అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఎం.చర్విత జాతీయస్థాయి అండర్‌-14 పాఠశాలల ఫుట్‌బాల్ జట్టులో స్థానం సాధించింది. వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చగా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా చర్వితను కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి అభినందించారు.

● 'న్యూఇరా'లో ఐన్‌స్టీన్ మెమోరియల్ వీక్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని న్యూ ఇరా పాఠశాలలో సోమవారం ఐన్‌స్టీన్ మెమోరియల్ వీక్ వేడుకలను నిర్వహించినట్లు న్యూ ఇరా విద్యాసంస్థల చైర్మన్ ఐవీ రమణారావు, డైరెక్టర్ పి.భూమేశ్వరరావులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మరిపెడ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడాక.. విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

● పోప్ ఫ్రాన్సిస్ మరణం తీరని లోటు

ఖమ్మంగాంధీచౌక్: క్యాథలిక్‌ల జగద్గురు పోప్ ఫ్రాన్సిస్ మరణం తీరనిలోటని ఖమ్మం పీఠం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ తన సందేశంలో పేర్కొన్నారు. సర్వ మానవాళి క్షేమం కోసం పరితపించిన ఫ్రాన్సిస్ సోమవారం రోమ్ నగరంలోని వాటికన్‌సిటీలో కన్నుమూశారని తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు అంతా సకల్పించాలని బిషప్ సూచించారు.

● అధ్యాపకుల 'చాక్‌పీస్ డౌన్'

ఖమ్మం సహకారనగర్ : నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చాక్‌పీస్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తడికమల్ల శేఖర్, వీరన్న, రవిబాబు, వీరాంజనేయులు, పి.మధు, లక్ష్మి, హరిత, రాణి, అద్దంకి తిలక్, చేకూరి రవికుమార్, డాక్టర్ శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● చలివేంద్రాల పరిశీలన

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని కవిత కాలేజీ, సరిత క్లినిక్ సెంటర్, బుర్హంపురం, రైతుబజార్, తదితర ప్రాంతాల్లో సీపీఐ ప్రతినిధి బృందం పత్రికల్లో వస్తున్న కథనాలను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఖాళీ కుండలు, పురుగులు, కుక్కలు దర్శనం ఇచ్చాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ సలాం మాట్లాడుతూ.. రూ.వేలతో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తే సరిపోదని, నిత్యం పర్యవేక్షణ చేస్తూ సేవలు అందించేలా ఓ వ్యక్తి కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే కార్పొరేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, త్రీటౌన్ ఏరియా కార్యదర్శి నూనెశశిధర్, జ్వాల నరసింహారావు, చాన శేఖర్, వి.రమణ, దుర్గానాథ్, మజీద్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

● డిప్యూటీ సీఎంను కలిసిన బార్ కార్యవర్గం

ఖమ్మంలీగల్: ఇటీవల ఎన్నికైన ఖమ్మం బార్ అసోసియేషన్ బాధ్యులు సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. మధిరలో ఆయనను కలవగా కార్యవర్గాన్ని అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు పరిచయం చేశారు. ప్రధాన కార్యదర్శి గద్దల దిలీప్‌కుమార్‌తో పాటు మేకల నవీన్, సింగారపు రాంబాబు, కేవీవీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● అనాథ శవాలకు అంత్యక్రియలు



మృతదేహాల వద్ద ఫౌండేషన్ సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని 60 ఏళ్ల వృద్ధుడు మృతిచెందగా.. మృతదేహాన్ని పెద్దస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. అలాగే తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మేడిదపల్లి గ్రామసమీపాన వ్యవసాయ బావిలో మృతిచెందిన 35 ఏళ్ల యువకుడి మృతదేహాన్ని, గుర్తు తెలియని మరో మహిళ మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతదేహాల కోసం ఎవరూ రాకపోవడంతో పోలీసులు, వైద్య సిబ్బంది సమాచారం మేరకు సోమవారం మూడు మృతదేహాలకు బల్లేపల్లిలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

● సదస్సును జయప్రదం చేయండి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఈ నెల 25న జరగనున్న ఉద్యోగ సదస్సును జయప్రదం చేయాలని అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.మాధవరావు కోరారు. సోమవారం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో సదస్సు పోస్టర్లను ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, వివిధ సంఘాల నాయకులు విజయకుమార్, కిరణ్‌కుమార్, ఓంకార్, శ్రీనివాస్, డాక్టర్ కార్తీక్, అనిత, కోటమ్మ, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ నాల్గవ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బిక్కు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడి లింగయ్య, వెంకటరమణ, వసంతరావు, గిరిజకుమారి, మాధవి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

● అదనపు కలెక్టర్‌కు వినతి



శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పూర్వ వీఆర్‌ఏలు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో వార్డు ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్న పూర్వ వీఆర్‌ఏలను జీపీఓలుగా తీసుకోవాలని పూర్వ వీఆర్‌ఏలు అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పూర్వ వీఆర్‌ఏలు కోటేశ్వరరావు, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా పని చేస్తామని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేస్తున్న వారికి తమకు ఎలాంటి సంబంధం లేదని, తమను జీపీఏలుగా నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.భూపతి, ఎన్. అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● వార్డు ఆఫీసర్లకు సన్మానం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నుల వసూళ్లలో అహర్నిశలు కృషి చేసిన గ్రూప్‌-4 ఉద్యోగులను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాస్‌లు సన్మానించారు. సోమవారం టీఎన్జీవోస్ భవన్‌లో 40 మంది వార్డు ఆఫీసర్లను అభినందించి సభ్యత్వాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. అదే విధంగా ఈ నెల 25న టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న సదస్సును, బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సంఘం నగర అధ్యక్షులు ప్రభాకరాచారి, మున్సిపల్ ఉద్యోగ సంఘ నాయకులు సుధాకర్, నాగరాజు పాల్గొన్నారు.

● నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మున్నేరు వరద నుంచి నగరాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్వాసితులకు 2013 సంవత్సరం ప్రభుత్వ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కాల్వొడ్డు మంచికంటి నగర్ నుంచి మున్నేరు వరకు భూ నిర్వాసితుల ప్రాంతంలో సీపీఎం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించిన సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు నగరంలోనే ఇంటి స్థలంతో పాటు ఇల్లు కట్టించి ఇవ్వాలని, ఇందుకు కేంద్రీయ విశ్వవిద్యాలయం వద్ద రైతుల భూములు లాక్కుంటే సహించేది లేదని హెచ్చరించారు. తీగల వంతెన కోసం నష్టపోతున్న 100 కుటుంబాలకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి రమేష్, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసురావు, జిల్లా నాయకులు జబ్బార్, ఎస్‌కె.మీరా, ఎస్.నవీన్‌రెడ్డి, త్రీటౌన్ కార్యదర్శి భుక్యా శ్రీనివాసురావు తదితరులు పాల్గొన్నారు.

● బోరు బావులు, మోటార్ల ఏర్పాటుకు వినతి

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించి, గిరిజన రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు బానోతు నాగేశ్వరరావు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌కు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని గిరిజనులు వ్యవసాయంతో పాటు కూరగాయలు, ఉద్యాన పంటల సాగు చేస్తారని తెలిపారు. ఐటీడీఏ ద్వారా గిరిజన రైతులకు బోరు బావులు, విద్యుత్ మోటార్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులు కల్పించాలని వినతిలో పేర్కొన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో ఉన్న ఏకైక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు.

● గోశాలకు 20 ట్రక్కుల వరిగడ్డి వితరణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెంలో ఉన్న ఓం శ్రీకృష్ణ గోశాలకు కాంగ్రెస్ నాయకుడు, ముదిగొండ మండల సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి 20 ట్రక్కుల వరిగడ్డిని సోమవారం వితరణగా అందించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు.. గ్రాసం అందించినట్లు తెలిపారు.

● పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్..



ప్యూరిఫైయర్‌ను ప్రారంభిస్తున్న బానోత్ బాల్య

రఘునాథపాలెం: మండల పరిధిలోని యూపీఎస్ రాములుతండా ప్రాథమికోన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులైన బానోత్ వెంకన్న, బానోత్ జ్యోతిలు వాటర్ ప్యూరిఫైయర్‌ను సోమవారం వితరణగా అందించారు. 2000-2001 విద్యా సంవత్సరంలో ఏడవ తరగతి పూర్తి చేసిన వీరు విద్యార్థులకు తాగు నీరు అందించాలనే లక్ష్యంతో వితరణ చేయగా.. వారి తండ్రి బానోత్ బాల్య ఆవిష్కరించారు. హెచ్ఎంలు మహతి, పైజాలతో పాటు సునీత, కవిత, సైదుబాబు, తావూరియా, వెంకట్, నాగేశ్వరరావు, మోతిలాల్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ చైతన్య, సీఆర్పీ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.